

జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు, డీసీపీ ఎం చేతన



అర్హులందరికీ సంక్షేమ పథకాలు



- నాలుగు కొత్త పథకాలకు శ్రీకారం
- రైతులకు రూ.446.56 కోట్ల రుణమాఫీ
- పెద్దపల్లిలో బస్ డిపోకు స్థలం కేటాయింపు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యానికి ప్రాధాన్యం
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ కోయ శ్రీహర్ష

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు శ్రీకారం చుట్టిందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ ఆవరణలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో పోలీసుల గౌరవం వందనం స్వీకరించిన అనంతరం కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

వివిధ శాఖల ద్వారా ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నాలుగు పథకాలను గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరు కూడా ఆందోళన చెందవద్దని అన్నారు.

రైతులకు రూ.446.56 కోట్ల రుణమాఫీ

రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ పథకంలో భాగంగా జిల్లాలో 58,896 మంది రైతులకు రూ.446 కోట్ల 54 లక్షల సొమ్మును రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. సాగులో ఉన్న వ్యవసాయ భూములకు ఎకరానికి ఏడాదికి రూ.12 వేలు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందజేస్తోంద న్నారు. వ్యవసాయానికి యోగ్యంగా లేని 3 వేల ఎకరాల భూములను గుర్తించామన్నారు. గడిచిన వానాకాలం సీజన్‌లో 26,652 మంది రైతుల నుంచి 2 లక్షల 29 వేల క్వింటాళ్లకు పైగా సన్నరకం ధాన్యం కొనుగోలు చేసి రూ.85 కోట్ల 33 లక్షలు బోనస్‌ను రైతులకు అందించామన్నారు. భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న 108 ఎకరాల 36 గుంటల భూమికి సం బంధించి రైతులకు రూ.10 లక్షల 89 వేల పరిహారం అందించామన్నారు. కోటి 31 లక్షల రూపాయల సబ్సిడీ విడుదల చేసి జిల్లాలో 2866 ఎకరాలలో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ చేశామన్నారు.

13,638 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా..

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుకు గ్రామసభల ద్వారా ప్రాథమికంగా 13,638 మందిని కూలీలను గుర్తించామన్నారు. కొత్తగా 12,705 నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డులను జారీ చేయనున్నామని పేర్కొన్నారు.

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా బస్సులో ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, జిల్లాలో ఇప్పటి వరకు 2 కోట్ల 40 లక్షలకు పైగా జీరో టికెట్లను అందించామని వివరించారు. రూ.11 కోట్ల 29 లక్షల రూపాయల సబ్సిడీని ప్రభుత్వం భరించి లబ్ధిదారులకు రూ.3 లక్షల 80 వేల 717 సిలిండర్లను రూ.500లకే సరఫరా చేసిందన్నారు. గృహజ్యోతి పథకం కింద జిల్లాలో రూ.54 కోట్ల 93 లక్షల సబ్సిడీని ప్రభుత్వం భరించి 1,30,273 గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ఆరోగ్యశ్రీ కింద 17,750 మందికి 40 కోట్ల 50 లక్షల రూపాయల వైద్య సేవలు అందించామని అన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యానికి ప్రాధాన్యం..

పేదలకు ఉచితంగా వైద్య సేవలను అందించేందుకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నా రు. జిల్లా కేంద్రంలో గల ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చి కొత్తగా 122 కంటి శస్త్ర చికిత్సలు, 744 డెంటల్ చికిత్సలు, 603 ఆర్థోపెడిక్ సర్జరీలను విజయవంతంగా నిర్వహించామన్నారు. మాతా శిశు ఆసుపత్రిలో నూతనం గా డీఈఐసీ ఏర్పాటు చేసి 21 మంది పిల్లలకు గుండె సంబం ధిత శస్త్ర చికిత్సలు చేయించా మన్నారు. 20 పడకలతో పిల్లల కోసం ప్రత్యేకంగా వార్డు ఏర్పాటు చేశామని, ప్రత్యేకంగా 5 ఫొటోథెరపీ యూనిట్లు, 5 వార్మర్లను ఏర్పాటు చేసి నవజాత శిశువులలో వచ్చే ఆరోగ్య సమస్యలకు

మిగతా 6వ పేజీలో..



ఆర్జీ2 ఏరియాలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

దేశానికి ఎన్టీపీసీ వెలుగులు..

గణతత్ర వేడుకలలో సీజీఎం చందన్ కుమార్ సామంత

జ్యోతినగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : రామగుండం ఎన్టీపీసీ దేశానికి వెలుగులను అందిస్తున్నదని ప్రాజెక్టు సీజీఎం చందన్ కుమార్ సామంత అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎన్టీపీసీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో సీజీఎం జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయన ప్రసంగిస్తూ సంస్థ ఉద్యోగులు, అధికారుల కృషి, అంకితభావం ఫలితంగానే ప్రాజెక్టు ఇన్నేళ్లుగా సమర్థవంతంగా నడుస్తోందన్నారు. సీఎస్ఆర్ పథకం కింద ప్రభావిత ప్రాంతాలలో అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. విద్యవైద్యం, మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలకు సీఎస్ఆర్ నిధులను ఖర్చు చేస్తున్నామని తెలిపారు. సీఎస్ఆర్ పథకం కింద 3 సంవత్సరాలలో 78 వేల మంది విద్యార్థులకు చేయూతనందించామని, 2.25 లక్షల మందికి లబ్ధి చేశామని సీజీఎం చెప్పారు. గత ఏడాది రామగుండం ఎన్టీపీసీ పలు అవార్డులు సాధించిందన్నారు. ఎన్టీపీసీలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీఐఎస్ఎఫ్ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టులో జీఎం అంజనారంజన్, రామగుండం ప్రాజెక్టులో జీఎం త్రిపాఠి పతాకాన్ని ఎగుర వేశారు.





వేదికపై కలెక్టర్ కోయ శ్రీహర్ష, జడ్జి డాక్టర్ హేమంత్ కుమార్, ఎమ్మెల్యే విజయరమణారావు, డీసీపీ ఎం చేతన, అధికారులు



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్



స్వశక్తి సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా జడ్జి హేమంత్ కుమార్, ఎమ్మెల్యే విజయరమణారావు, అధికారులు



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న ఆర్జీ-2 జీఎం



ఎన్టీపీసీలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు



గోదావరిఖనిలో జెండావిష్కరణ చేస్తున్న ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్



జెండా ఎగురవేస్తున్న ఎన్టీపీసీ సీజీఎం చందన్ కుమార్ సామంత



అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో పాఠశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



కమిషనరేట్‌లో జెండా ఆవిష్కరణ అనంతరం మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

ఎన్టీపీసీ విస్తరణకు రేపు ప్రజాభిప్రాయ సేకరణ

- ఏర్పాట్లను పరిశీలించిన సీపీ

4

మున్సిపాలిటీలకు స్పెషల్ ఆఫీసర్ల నియామకం

కోల్‌సిటీ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రామగుండం నగరపాలకసంస్థతో పాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 25న మున్సిపల్ కార్యదర్శి దాన కిశోర్ జీఓ నెం.15 జారీ చేశారు. రామగుండం నగరపాలక సంస్థకు కలెక్టర్ కోయ శ్రీహర్షను ప్రత్యేకాధికారిగా నియమించారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథనికి అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) అరుణశ్రీని నియమించారు. అరుణశ్రీ ప్రస్తుతం రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్‌గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు అదనంగా మూడు మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారిగా నియమించారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 26తో ముగిసింది. మళ్లీ ఎన్నికలు జరిగి కొత్త పాలకవర్గాలు కొలువు తీరే వరకు ప్రత్యేక అధికారుల పాలననే ఉండనున్నది. పాలన, ఆర్థిక పరమైన నిర్ణయాలు ప్రత్యేకాధికారులు తీసుకోనున్నారు. పాలనపరమైన అనుమతులు ఇక నుంచి ప్రత్యేక అధికారులే ఇవ్వనున్నారు. మొత్తంగా జిల్లాలోని పట్టణ స్థానిక సంస్థలు పూర్తి పాలన కలెక్టర్, అదనపు కలెక్టర్ చేతుల్లోకి వెళ్లింది.

పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పథకాలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఆయా మండలాల్లోని 13 గ్రామాలను ఎంపిక చేశారు. కాట్నపల్లి, శివపల్లి, షానగొండ, నిమ్మనపల్లి, కోనరావుపేట, అంకంపల్లి, మద్దిర్యాల, రామరావుపల్లి, బంజేరుపల్లి, రొంపికుంట, అడవి శ్రీరాంపూర్, మచ్చుపేట, రత్నాపూర్ గ్రామాల్లో అధికారులు, ఎమ్మెల్యేలు పాల్గొని పథకాలను ప్రారంభించారు.





శివపల్లిలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, రామరావుపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎలిగేడు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన వారందరికీ అందిస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. శివపల్లిలో ఆదివారం జరిగిన ప్రజాపాలన నాలుగు పథకాల ప్రారంభోత్సవంలో కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్లలో పేదలకు ఏ ఒక్క పథకం అందలేదని, ఏడాది కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. గణతంత్ర దినోత్సవం రోజు నాలుగు పథకాలను ప్రారంభించుకోవడం సంతోషదాయకమన్నారు. శివపల్లిలో 213మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహాలు, 73మందికి ఇందిరమ్మ ఆత్మీయభరోసా, 97మందికి రేషన్‌కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామంలో 211మంది రైతులకు రూ.93లక్షల బోనస్ ఖాతాల్లో జమచేశామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మండల స్పెషల్ ఆఫీసర్ రమేష్‌కుమార్‌నాయక్, ఎంపీడీఓ భాస్కర్‌రావు, తహసీల్దార్ బషీరోద్దీన్, నాయబ్ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఏవో ఉమాపతి, పీఆర్ఏఈ జగదీశ్వర్, యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

పాలకుర్తి,(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తామని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్ హామీ ఇచ్చారు. రామరావుపల్లెలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు పథకాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. రానున్న 15 రోజుల్లో బండలవాగు ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంత బీడుభూములను సస్యశ్యామలం చేస్తానని తెలిపారు. గ్రామంలో 285 మందికి రైతు భరోసా, 41 మందికి ఆత్మీయ భరోసా, 62 మందికి రేషన్ కార్డులు, 10 మందికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసిడింగ్ పత్రాలను అందించారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్, మేయర్ బంగి అనీల్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్, ఎంపీడీవో పూర్ణచందర్ రావు, తహసీల్దార్ జ్యోతి, ఏవో ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రారంభించిన 4 పథకాలను క్రమపద్ధతిలో చివరి లబ్ధిదారుడి వరకు అమలు చేస్తామని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. కాట్నపల్లిలో పథకాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులను ఎంపిక చేసి గ్రామసభలో ఆమోదించుకొని అమలు చేస్తున్నామన్నారు. భూమి లేని వ్యవసాయ కూలీలను 50 మందిని గుర్తించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 176 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, అర్హులకు రేషన్ కార్డులు వస్తాయ న్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పది సంవత్సరాలలో ఒక ఇండ్లు కూడా శివపల్లి గ్రామానికి ఇవ్వలేదన్నారు. శివపల్లిలో 213 మందికి ఇండ్లు మంజూరు చేశామన్నారు. తహసీల్దార్ ఎంపీడీవో, మండల స్పెషల్ అధికారి, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.



లబ్ధిదారుడికి మంజూరు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి


వశీకర్ (ఫైల్)

మానకొండూర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన కనకం వశీకర్ (13) అనే విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పచ్చునూర్ గ్రామానికి విద్యాసాగర్ అనే వ్యక్తి మండలంలోని కెల్లేడు గ్రామానికి చెందిన వరలక్ష్మీని వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు వశీకర్, కూతురు జన్మించారు. కాగా 2019లో స్వప్న అనే మరో అమ్మాయిని వివాహం చేసుకొని అల్గునూర్‌లో నివాసం ఉంటున్నారు. దీంతో వరలక్ష్మి పిల్లలతో కలిసి తల్లిగారింటికి వెళ్లి జీవిస్తోంది. వశీకర్ తిమ్మాపూర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులుండడంతో ఇంటికి వచ్చినట్లు తెలిపారు. శనివారం ఇంటిలో ఊయల ఊగుతుండగా చీర మెడకు చుట్టుకొని ఊపిరి ఆడక మృతి చెందాడు. తన కుమారుడు మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

కథలాపూర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండకు చెందిన కనికరపు నర్సయ్య (32) అనే వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం మేరకు.. భార్యతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. కాపురానికి రావడం లేదని భార్యను చితకబాదాడు. ఆమె ఇంటి నుంచి వెళ్లిపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శవాన్ని పోస్టుమార్టంకు పంపి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదనపు కట్నం వేధింపులు తట్టుకోలేక వివాహిత బలవన్మరణం

వీణవంక, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామంలో ఓ మహిళ అదనపు కట్నం వేధింపులు భరించలేక ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లూరు గ్రామానికి చెందిన మరుపాక రమ్య(26) అనే మహిళలను భర్త సాయికిరణ్ అదనపు కట్నం తేవాలంటూ వేధింపులకు గురిచేశాడు. వేధింపులు భరించలేక ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంట్లోని దూలానికి చున్నితో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి మేనమామ కొమ్ము శ్యామ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

కిరాణ షాపులో చోరీ

శంకరపట్నం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని కేశవపట్నంలో శనివారం రాత్రి ఓ కిరాణం షాపులో గుర్తు తెలియని వ్యక్తులు ఐదు లక్షల విలువ చేసే ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపిన వివరాల ప్రకారం గుర్రం అనిత తన ఇంటిలో కిరాణం షాపు నడుపుకుంటూ జీవిస్తోంది. ఈ నెల 25న సాయంత్రం హనుమకొండలోని తన బంధువుల ఇంటిలో ఫంక్షన్‌కు వెళ్లారు. తిరిగి ఆదివారం ఉదయం తన ఇంటికి వచ్చి చూసేసరికి షాపు రేకులకు ఉన్న స్క్రూలు విప్పి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి దొంగతనానికి పాల్పడి షాపులోని బంగారం నగలు, వెండి వస్తువులు, కొంత కిరాణం సామగ్రి ఎత్తుకెళ్లారు. వాటి విలువ రూ. 5లక్షలు ఉంటుందని, గుర్రం అనిత పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మటన్ దుకాణాలపై అధికారుల దాడులు

కోరుట్ల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మున్సిపల్ అధికారులు పట్టణంలోని మటన్, చికెన్ సెంటర్లలో దాడులు నిర్వహించారు. మటన్, చికెన్ విక్రయిస్తున్న దుకాణదారులకు మున్సిపల్ అధికారులు పినాయిల్‌ను చల్లి స్వాధీనం చేసుకున్నారు. మటన్ యజమానులకు జరిమానాలను విధించారు. మున్సిపల్ కమిషనర్ తిరుపతి అధ్వర్యంలో దాడులను నిర్వహించి జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ బాలే ఆశోక్ కుమార్ సిబ్బంది జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కోరుట్ల రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోహన్ రావుపేట గ్రామ శివారులోని పోచమ్మ ఆలయ ప్రాంతంలో పేకాట అడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద 5,050 రూపాయల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు ట్రాలీ ఆటోలు ఢీ

చందుర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ బస్టాండ్ వద్ద రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం సిద్దిపేటకు చెందిన ట్రాలీ ఆటో కోరుట్లకు వెళ్లి తిరిగి వెళ్తోంది. చందుర్తికి చెందిన ట్రాలీ ఆటో మల్యాలకు వెళుతుండగా మూలమలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటోలు ధ్వంసం కాగా, డ్రైవర్లకు స్వల్ప గాయాలైనట్టు తెలిపారు. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్గిల్ లేక్ వద్ద అగ్నిప్రమాదం

- 14 గుడిసెలు దగ్ధం.. రూ.5లక్షల ఆస్తి నష్టం


కాలి బూడిదైన వలసకూలీల పూరి గుడిసెలు

సిరిసిల్ల క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని 14 గుడిసెలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. పట్టణంలోని సాయినగర్, వెంకటరావునగర్‌ల మధ్య గల కార్గిల్ లేక్ వద్ద ఛత్తీస్‌గఢ్ నుంచి వివిధ కూలీ పనుల కోసం సిరిసిల్లకు వలసవచ్చిన కూలీలు పట్టణంలోని కార్గిల్ లేక్ వద్ద గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. కూలీందరు ఉదయమే పనులకు వెళ్లారు. ఓ గుడిసెలో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించడంతో స్థానికులు చూసి పోలీసులకు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్‌సిబ్బంది వ్యాపించిన మంటలను ఆర్పివేశారు. అయినప్పటికీ 14 గుడిసెలు, కూలీల కట్టు బట్టలతో సహా ఆహార సామగ్రి , ఇతర వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. ప్రమాద సమయంలో కూలీలెవరూ గుడిసెల్లో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దాదాపు రూ. 5లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు ఫైర్ అధికారి నరేందర్ తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వలసకూలీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రమాదంపై స్పందించిన సిరిసిల్ల ఆర్డీవో రాధాభాయి వెంటనే 14 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2వేలు తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. వలసకూలీలకు రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రెండు క్వింటాళ్ల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లావణ్య, తహసీల్దార్ ఉమారాణి, టౌన్ సీఐ కృష్ణ, ఆర్‌ఐలు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ రెడ్యానాయక్, జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిమల్ల హనుమాండ్లు, టౌన్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు ఇంకెన్నాళ్లు?

- ఏడాదిన్నర దాటినా ఎక్కడి పనులు అక్కడే
- చొప్పదండిలో రోడ్డుపైనే పండ్లు, కూరగాయల విక్రయాలు


నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

చొప్పదండి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పనులు నిలిచిపోయి ఏడాదిన్నర దాటింది. ఎంతో ఆర్భాటంగా పనులను ప్రారంభించి గత 2023 సెప్టెంబరు నెలలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులను కాంట్రాక్టర్ నిలిపివేశారు. ఏడాదిన్నర గడిచింది. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. 2023 ఫిబ్రవరిలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీ రామారావు చొప్పదండిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మూడు కోట్ల రూపాయలను కేటాయించగా వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్మాణాన్ని ప్రారంభించారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పనులు ప్రారంభం కాలేదు.


రోడ్లపైనే కూరగాయల విక్రయాలు

● ఇబ్బందిపడుతున్న పట్టణవాసులు

పట్టణంలో కూరగాయల మార్కెట్ లేకపోగా కరీంనగర్-రాయపట్నం రహదారి పైనే క్రయవిక్ర యాలు కొనసాగుతు న్నాయి. పండ్లు, మాంసం విక్ర యాలు ప్రధాన రహదారికి ఇరువైపులా కొనసాగు తున్నాయి. వారసంత కూడా రోడ్డుపైనే కొనసాగు తోంది. రెవెన్యూ కార్యాలయం, మండల పరిషత్, పోలీస్ స్టేషన్, మున్సిపల్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంబేద్కర్ స్టడీ సర్కిల్‌కు వెళ్లే పాత గ్రామ పంచాయతీ రోడ్డుపైనే వారసంత ప్రతి శుక్రవారం కొనసాగుతోంది. ఇరుకుగా ఉన్న రోడ్డుపై సంత నిర్వహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇప్పటికైనా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పెద్ద లింగాపూర్ చెరువుకు నీటి విడుదల

ఇల్లంతకుంట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద లింగాపూ ర్ గ్రామంలోని సదర్ చెరువుకు ఆదివారం అధికారులు నీటి విడుదల చేశారు. రంగనాయకసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేయాలని రైతులు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించారు. నీటి విడుదలతో భూగర్భ జలాలు పెరుగుతాయని పేర్కొంటూ ఎమ్మెల్యేకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు

ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి కృషి

ఇల్లంతకుంట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికట్కూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తానని ఏఎంసీ మాజీ చైర్మన్ చింతపల్లి వేణురావు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలకు రంగులు వేసి రైలు బడిగా మార్చడంతో పలువురు నాయకులు ఆదివారం పాఠశాలను సందర్శించారు. రైలుబడిగా మార్చడానికి సహకరించిన వేణురావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు రాజులతో పాటు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సహకార సంఘాల అక్రమార్కులను వదిలిపెట్టం

- బీఆర్ఎస్ నేతల అక్రమాలను బయటపెడతా - ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలో పలు సహకార సంఘాల్లో అక్రమాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టమని, సమగ్ర విచారణ జరిపిస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల గెస్ట్ హౌజ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016 సంవత్సరంలో రూ. 60 కోట్ల ప్రతిపాదనలతో ప్రారంభం అయిన రోళ్ల వాగు ప్రాజెక్టు రూ. 160 కోట్లకు వ్యయాన్ని పెంచినప్పటికీ, దాని నిర్మాణాన్ని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఆ సమయంలో మంత్రి హోదాలో ఉన్న కొప్పుల ఈశ్వర్ ప్రాజెక్టుకు ఫారెస్ట్ క్లియరెన్స్ తీసుకొని రాలేకపోయారని ఎద్దేవ చేశారు. సహకార సొసైటీల నుంచి రైతుల వారి అవసరానికి లోన్లు తీసుకొని నిబంధనల ప్రకారం వాటిని సాగుకు ఇతరాత్ర అవసరాలకు వినియోగించాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ధర్మపురి, పెగడపల్లి, గొల్లపల్లి సొసైటీల్లో గత 10 సంవత్సరాల్లో రైతులు జమ చేసిన డబ్బు ఎంత, ఎంత డ్రా చేశారు, ఎందుకు డ్రా చేశారు... వాటి లెక్కలపై విచారణ జరపాలని హైదాబాద్‌లో సంబంధిత ప్రిన్సిపల్ సెక్రెటరీని కలిసి ఫిర్యాదు చేశానని తెలిపారు. ఉన్నతాధికారులతో కూడిన విచారణ కమిటీ వచ్చి సొసైటీలపై విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని వివరించారు. ఈ నేపథ్యంలో ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన కొందరు నేతలు తమపై అన్యాయంగా విచారణ జరిపించారంటూ హైకోర్టును ఆశ్రయించారన్నారు. తమపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అనడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. పెగడపల్లి మండల సొసైటీ నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా రూ. 1.64 కోట్ల డబ్బులను షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి డ్రా చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అన్ని సొసైటీల్లో ఎక్కడ కూడా పారదర్శకత లేదని విమర్శించారు. ఇక్కడి గోదావరి నీటిని సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వెల్ తరలించినప్పటికీ అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రేక్షక పాత్ర వహించారని విమర్శించారు. ధర్మపురి నియోజకవర్గంలోని సహకార సొసైటీల్లో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ జరిపిస్తామని, బాధ్యులకు చట్టానికి లోబడి నోటీసులు పంపిస్తామని వివరించారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో జరిగిన అక్రమాల బాగోతాలను ఎపిసోడ్‌ల వారీగా బయటపెడుతానని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, గొల్లపల్లి మండల కాంగ్రెస్ నాయకులు నిశాంత్ రెడ్డి, పెగడపల్లి మండల కాంగ్రెస్ నాయకులు రాములు గౌడ్, గొల్లపల్లి మార్కెట్ కమిటీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రేపు ప్రజాభిప్రాయ సేకరణ

- ఏర్పాట్లను పరిశీలించిన రామగుండం సీపీ ఎం శ్రీనివాస్


ప్రజాభిప్రాయ సేకరణ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

జ్యోతినగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించనున్న తెలంగాణ సూపర్ థర్మల్ పవర్‌ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ) స్టేజ్-2కు సంబంధించి ఈనెల 28న జరుగనున్న ప్రజాభిప్రాయ సేకరణ సమావేశ ఏర్పాట్లను ఆదివారం రామగుం డం సీపీ ఎం శ్రీనివాస్ పరిశీలించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ చేతనతో కలిసి ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానాన్ని సీపీ పరిశీలించారు. సభాస్థలి, వీజీపీ, సాధారణ ప్రజల పార్కింగ్ స్థలం, రూట్‌కు సంబంధించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. త్వరలో ఎన్టీపీసీ నిర్మించనున్న 2,400 మెగావాట్ల టీఎస్‌టీపీపీ రెండో దశ కోసం కోసం 28న పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తున్నారు. పార్కింగ్ ఎక్కడ ఏర్పాటు చేయాలి, బ్యారికేట్ల ఏర్పాటు, సభకు వచ్చే ప్రజలకు ఏర్పాటు చేసే భోజనశాల, సభాస్థలికి వచ్చే మార్గాలను పరిశీలించారు. ఇతరప్రాంతాల నుంచి వచ్చే ప్రజల వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సీపీ అధికారులకు సూచనలు చేశారు. ప్రజాప్రాయసేకరణ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా గట్టి బందోబస్తు, పటిష్ట ఏర్పాట్లను చేస్తున్నారు. సీపీ వెంట అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సి రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, ట్రాఫిక్ ఏసీపీ జాడి నర్సింహులు, రామగుండం, గోదావరిఖని సీఐలు ప్రవీణ్ కుమార్, ఇంద్రసేనారెడ్డి, ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్ కిరణ్, మానస, రామగుండం ఎస్‌ఐ సంధ్యారాణి పాల్గొన్నారు.

రామగుండం కమిషనరేట్‌లో సిటీ పోలీస్ యాక్ట్

కోల్‌సిటీ (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలో సిటీ పోలీస్ యాక్ట్, సెక్షన్ 30 పోలీస్‌యాక్ట్ అమలు చేస్తున్న రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి 31వ తేదీ ఉదయం ఆరు గంటల వరకు అమలులో ఉంటుందన్నారు. కమిషనరేట్ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, వివిధ కారణాలు చూపుతూ బంద్‌ల పేరిట బలవంతంగా సంస్థలు, కార్యాలయాలను మూసివేయాలని ఒత్తిడి తేవడం, బెదిరింపులకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు

ధర్మారం జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడారంలో ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు ఆదివారం బైఠాయించింది. బాధితురాలి వివరాల ప్రకారం.. మండలంలోని బొట్లవనపర్తి గ్రామానికి చెందిన ఆవుల శిరీషకు మేడారం గ్రామానికి చెందిన రాచూరి వెంకటేష్‌తో 2021లో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఇద్దరు కొద్దిరోజుల కలిసి ఉన్నారు. అనంతరం శిరీషాకు హన్మకొండకు చెందిన ఓ వ్యక్తితో 2021 డిసెంబరులో వివాహం అయ్యింది. పెళ్లి అయిన పది రోజులకు శిరీష భర్తకు వెంకటేష్ ఫోన్ చేసి, తన లవర్‌ను నువ్వెలా పెళ్లి చేసుకుంటావని, విడాకులు ఇస్తే పెళ్లి చేసుకుంటానని చేసుకుంటానని అడిగాడు. దీంతో కొద్ది రోజులకు శిరీషకు హన్మకొండ వాసి విడాకులు ఇచ్చాడు. అప్పటి నుంచి వెంకటేష్ శిరీషతో సహజీవనం చేయగా ఓ పాప జన్మించింది. మూడు సంవత్సరాలు సహజీవనం చేస్తున్నాడు. నెల రోజులుగా గొడవలు జరుగుతుండగా ఇరుకుటుంబాలతో పెద్దమనుషుల సమక్షంలో ఆదివారం పంచాయతీ జరిగింది. కాగా శిరీషతో పాటు వారి బంధువులు వెంకటేష్ ఇంటికి రాగా తాళం వేసి ఉంది. దీంతో శిరీష వెంకటేష్ ఇంటి ఎదుట పాపతో కలిసి బైఠాయించింది. వెంకటేష్ తనను వివాహం చేసుకోసుకొని న్యాయం చేయాలని వేడుకుంది. ఆమెకు పెద్దపల్లి జిల్లా ఝాన్సీ లక్ష్మీబాయి మహిళా సంఘం అధ్యక్షురాలు అరికిల్ల రామలక్ష్మి ఆధ్వర్యంలో పది మంది మహిళలు మద్దతు తెలిపారు.

క్షుద్ర పూజల పేరిట మోసం

- ఏడుగురిపై కేసు, నలుగురు అరెస్టు

నస్పూర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): క్షుద్రపూజలు నిర్వహించి డబ్బు సంపాదించవచ్చని మాయమాటలు చెప్పి పూజల పేరిట మోసం చేసిన సంఘటన నస్పూర్‌లో జరిగింది. ఘటనకు సంబందించి ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేయగా నలుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై సుగుణాకర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. క్షుద్రపూజలు చేస్తే కోట్ల రూపాయల డబ్బు సంపాదించవచ్చని మంచిర్యాల పట్టణానికి చెందిన మాదంశెట్టి ప్రభంజన్‌కు రంజిత్, బాలకృష్ణ నమ్మించారు. వాళ్ల మాటలు నమ్మిన ప్రభంజన్ రెండు లక్షల రూపాయలతో ఈనెల 24న రాత్రి 11 గంటలకు స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఐత సత్యనారాయణ ఇంటికి వెళ్లాడు. అక్కడ అప్పటికే పూజారి శీతల్ దత్తాత్రేయ కొరవి ఝాదవ్(మహారాష్ట్ర), దెబ్బటి కిషన్(సీతారాంపల్లి-నస్పూర్) దంతెల ప్రభాకర్, ఎరిసి ప్రశాంతి(జగిత్యాల), రంజిత్, బాలకృష్ణ (మంచిర్యాల) ఉన్నారు. అదేరోజు రాత్రి రెండు గంటల సమయంలో పూజలు ప్రారంభించారు. అనుమానం వచ్చి డబ్బు తీసుకుని వెళ్లిపోయే ప్రయత్నం చేయగా అడ్డుకుని చంపుతామని బెదిరించారు. అక్కడి నుంచి తప్పించుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శీతల్ దత్తాత్రేయ కొరవి ఝాదవ్, దెబ్బటి కిషన్, ఐత సత్యనారాయణ, ఎరిసి ప్రశాంతిని అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని ఎస్సై సుగుణాకర్ తెలిపారు.

లేబర్ హెల్త్ క్యాంపును అడ్డుకున్న కార్మిక సంఘాల నాయకులు

- నామమాత్రంగా పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆరోపణ


హెల్త్‌క్యాంపు అధికారులతో మాట్లాడుతున్న కార్మిక, ప్రజాసంఘాల నాయకులు

వీర్నపల్లి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నామమాత్రంగా నిర్వహిస్తున్న కార్మికుల హెల్త్ క్యాంపును సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎగుమంటి ఎల్లారెడ్డి కార్మిక, ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆదివారం అడ్డుకున్నారు. క్యాంపు ఏర్పాటు చేసి సరైన పరీక్షలు చేయడం లేదని మండిపడ్డారు. హెల్త్ క్యాంపులో మందులు, పరీక్షలు చేసేందుకు పరికరాలు అందుబాటులో లేకుండా పరీక్షలు నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. కార్మికులను మోసం చేసుకుంటూ ప్రభుత్వం ఉచిత హెల్త్ క్యాంప్ లో ఒక్కొక్క కార్మికుని పేరిట రూ. 3500 వెల్ఫేర్ బోర్డు నుండి తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్మికుల డబ్బులను కార్మిక సంక్షేమానికి మాత్రమే ఉపయోగించాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకుడు మల్లారపు అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కార్మిక శాఖకు మంత్రిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం హెల్త్ క్యాంపులో అన్ని వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో సిఐటియు నాయకులు రాజేష్, నర్సయ్య, నరేందర్, రాజేలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిపై కేసు

వీణవంక, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడాలపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మామిడాలపల్లిలో పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్, ట్రాలీని పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్ డ్రైవర్ గోపిచందర్‌పై, ట్రాలీ ఓనర్ గంగాదేవి సంపత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెద్దపులి కోసం గాలిస్తున్న అధికారులు


పొలంలో అధికారులు గుర్తించిన పులి అడుగులు

కొడిమ్యాల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్‌గ్రామ శివారులో ఆవుపై నాలుగు రోజుల క్రితం పెద్దపులి దాడి చేయగా ఆవు మృతి చెందగా అటవీ అధికారులు పెద్దపులి సంచారంపై ఆరా తీస్తున్నారు. జగిత్యాల డీఎఫ్‌వో ఆదేశాలతో కొడిమ్యాల రేంజర్ మొయినుద్దీన్ ఆధ్వర్యంలో డీఆర్వోలు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ అధికారులు, వాచర్లు మూడు రోజులుగా మండలంలోని అటవీ ప్రాంతాన్ని నాలుగు బృందాలుగా విడిపోయి జల్లెడ పడుతున్నా రు. మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో ఆవుపై దాడి చేసిన గుడిసె పరిసర ప్రాంతాల్లో అటవీ అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను అనుక్షణం పరిశీలిస్తున్నారు. రెండు రోజులుగా పెద్దపులి వస్తున్నట్లు ఆనవాళ్ల ను బట్టి అధికారులు గుర్తించారు. ఆదివారం సాయంత్రం కొడిమ్యాల మండలం దాటి వేములవాడ మండలం నూకలమర్రి అటవీ ప్రాంతానికి పెద్దపులి తరలినట్లుగా అటవీ అధికారులు భావిస్తున్నారు. అడవిలోని మైదాన ప్రాంతంలో, పొలంలో పెద్దపులి అడుగులను అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. పెద్దపులి సంచారంపై అధికారులు ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు.

శివరాత్రికి భారీగా ఏర్పాట్లు

- ముస్తాబవుతున్న వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం
- నాలుగు కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా...
- రూ.1.75 కోట్లతో జాతరకు మహా ఏర్పాట్లు

సిరిసిల్ల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి వేడు కలకు ఏర్పాట్లు ప్రారంభించారు. ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు మహాశివరాత్రి జాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపడుతున్నారు. రూ.1.75 కోట్లతో ఏర్పాట్లు చురుకుగా చేస్తున్నారు. ఈసారి మహా శివరాత్రికి 4లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసి అందుకు అనుగు ణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వేములవాడ రాజన్న అంటేనే కోడె మొక్కులకు ప్రత్యేకం కావడంతో అందు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయ ప్రాకారాలు, గోపురాలను అగ్నిమాపక యంత్రా లతో శుభ్రపరిచి రంగులు వేసే పనులు మొదలుపెట్టారు. ఆలయ ప్రాంగణంతో పాటు భక్తులు సేదతీరే ప్రాంతాల్లో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఏర్పాట్లకు సంబంధించి జా తర సమన్వయ సమావేశాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, దేవస్థానం ఈవో వినోద్ రెడ్డిల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై నిర్ణయాలు చేశారు. వేములవాడ దేవస్థానం పరిసరాల్లో రూ.37 లక్షలతో చలువ పందిళ్లు, రూ.20 లక్షలతో శివార్చన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రధాన దేవాలయానికి రంగులు రూ.7.40 లక్షలు, అనుబంధ దేవాలయాలకు రూ.8 లక్షలు, ధర్మగుండం, ఆర్చీ గేట్లు రంగులకు రూ. 4.50 లక్షలతో పాటు బతుకమ్మ తెప్ప నుంచి తిప్పాపూర్ వరకు అత్యవసరంగా రోడ్డుకు రూ.4.50 లక్షలు, భక్తులకు నీటి సరఫరాకు రూ.4.70 లక్షలు, ఆర్టీసీ బస్టాండ్ నుంచి దేవాలయం పార్కింగ్ స్థలం వరకు ఉచిత బస్సులు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటివి చేస్తున్నారు.



దేవస్థానంలో ఏర్పాట చేసిన చలువ పందిళ్లు



జాతర రోజు ప్రత్యేక కార్యక్రమాలు ఇలా...

మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిబ్రవరి 25న రాత్రి 7 గంటలకు ప్రభుత్వ తరఫున, రాత్రి 7.30 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వారి ద్వారా శ్రీస్వామివారికి పట్టు వస్త్రాల సమర్పణ ఉంటుంది. 25 అర్ధరాత్రి దాటిన తరువాత (మహా శివరాత్రి రోజు 26న) 12 గంటల నుంచి 2.30 గంటల వరకు స్థానికులకు సర్వదర్శనానికి అనుమతిస్తారు. తెల్లవారుజామున 3.40 గంటల నుంచి 4.30 వరకు సుప్రభాత సేవ, ఆలయ శుద్ధి, ఉదయం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు ప్రాతఃకాలపూజ నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు శివదీక్ష స్వాముల దర్శనం, 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మహాలింగార్చన, రాత్రి 11.35 గంటలకు లింగోద్భవ కాలం నుంచి శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో సేవలు...

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల కోసం ఆన్‌లైన్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చారు. బ్రేక్ దర్శనం అమలు చేస్తున్నారు. వేములవాడ ప్రధాన ఆలయంతో పాటు భీమేశ్వర, నగరేశ్వర, బద్దిపోచమ్మ దేవస్థానాల్లో జరిగే శాశ్వత పూజల వివరాలు, వసతి గదులు, అద్దెలు, నిత్య పూజల వివరాలు కూడా ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు. టికెట్లను కూడా వేములవాడ డాట్ తెలంగాణ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో బుక్ చేసుకునే అవకాశాలు ఉన్నాయి. వేములవాడ దేవస్థానానికి వచ్చే భక్తులకు భీమేశ్వర సదన్ గెస్ట్‌హౌజ్‌లో ఏసీ గదులు, నందీశ్వర ఏసీ గదులు, నాన్ ఏసీ గదులు అమ్మవారి అతిథి గృహం, పార్వతీపురం బ్లాక్ గదులు, లక్ష్మీపార్వతీ కాంప్లెక్స్ గదులు కూడా ఉన్నాయి.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- కోడెమొక్కు చెల్లించుకున్న భక్తులు



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయం

వేములవాడ కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి శనివారం రాత్రి వేములవాడకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కల్యాణకట్టలో తలనీ లాలు సమర్పించుకున్న భక్తులు ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్‌లో భక్తులు శ్రీస్వామి దర్శనం కోసం బారులు తీరారు. శ్రీపార్వతి దేవి అమ్మవారికి ఓడిబియ్యం పోసి కనుములను సమర్పించుకున్నారు. అనంతరం అనుబంధ ఆల యా ల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు, బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఏఈవోలు శ్రావణ్ కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, సూపరింటెండెంట్ తిరుపతిరావు, రాజేందర్, నరేందర్, నర్సయ్య, పీఆర్వో శ్రీకాంత్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా మైలారం మల్లికార్జున స్వామి జాతర



స్వామి వారి ఆలయంలో వేసిన పెద్దపట్నం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ప్రముఖ శైవక్షేత్రం మైలారం మల్లికార్జున స్వామి జాతరను ఆదివారం ఆలయ కమిటీ ఘనంగా నిర్వహి ంచింది. కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పెద్దపట్నాలు, స్వామివారి కల్యాణం, పల్లకీ సేవ కన్నుల పండుగగా సాగింది. వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరై స్వామిని దర్శించుకు న్నారు. అనంతరం వారిని ఆలయకమిటీ సన్మానించి మెమొంటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు వరాల పర్శరా ములు, వివిధ పార్టీల నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓదెల మల్లన్న క్షేత్రంలో భక్తుల పూజలు

ఓదెల,(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన భ్రమరాంబ మల్లి కార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించారు. అలాగే ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు కోడే మొక్కులను సమర్పించారు.

ఆలయాల చిత్రకళను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యం



ఆలయం పైన ఉన్న రూపాలను చిత్రిస్తున్న కళాకారులు

ముత్తారం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సందరెల్లి వద్ద ఉన్న పురాతన ఆలయా లకు టార్చ్ పునర్జీవ సంస్థ ఆధ్వర్యంలో 50 మంది చిత్ర కళాకారులు ఆదివారం సందర్శించారు. వారు మాట్లాడుతూ కాలజ్ఞాన పేరుతో హైదరాబాదు నుండి రెండు రోజుల యాత్రలో భాగంగా సందరెల్లి పురా తన ఆలయాలను సందర్శించామని, అంతరించిపోతున్న ఆలయాల కళను చిత్రకళ ద్వారా ప్రపంచానికి తెలియజేయడంలో భాగంగా సందరెల్లి ఆలయాన్ని సందర్శించామన్నారు ఇక్కడి శిల్పాలను చిత్రీ కరించి వాటిని వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు. శేష బ్రహ్మం, త్యాగరాజు, నిరంజన్, పోషం, ముకుంద ఆర్ట్ అకాడమీ డైరెక్టర్ రమేష్ కుమార్, ఆర్కియాలజిస్ట్ రవీందర్‌లు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో అలరించిన మ్యూజికల్ నైట్



పాడుతున్న గాయని శిరీష

జ్యోతినగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి ఎన్టీపీసీ సెయింట్ క్లేర్ స్కూల్ మైదానంలో నిర్వహించిన మ్యూజికల్ నైట్ అలరించింది. ఎన్టీపీసీ జ్యోతిక క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సీజీఎం చందన్ కుమార్ సామంత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సినీ నేపథ్య గాయకులు కౌశిక్, శిరీష, లాస్య ప్రియ సినిమా పాటలు పాడారు. మూడు గంటలపాటు సినీ, జానపద, దేశభక్తి గీతాలు పాడి అందరిని ఆకట్టుకున్నారు.



పాడుతున్న గాయకుడు కౌశిక్

చివరి ఆయకట్టు వరకు నీరందించండి

- లేకుంటే కెనాల్ గేట్లను ఎత్తుతాం
- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నియో జకవర్గ పరిధిలో ఎసా రెస్పీ నీరు చివరి ఆయకట్టు వరకు అం దిం చేందుకు చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలా కర్ ఎస్సారెస్పీ అధికారులను ఆదేశిం చారు. శ్రీరాంసాగర్ ప్రా జెక్టు నుంచి కాకతీయ కెనాల్ ద్వారా మూడోవిడత నీరు విడుదల కానున్న నేపథ్యంలో కరీంనగర్ మండల రైతులు ఎస్సారెస్పీ నీరు చివరి ఆయకట్టుకు అందడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే ఎస్సారెస్పీ ఉన్నతాధికారులు, పర్యవేక్షక ఇంజనీరుకు ఫోన్ చేశారు. కరీంనగర్ మండలంలోని చివరి ఆయకట్టు వరకు గత కొన్నేళ్లుగా నీరందక పొలాలు వేసుకోలేని పరిస్థితి ఉందని, నీరు అందక పొలాలు ఎండిపోతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సారెస్పీ డీ86 నుంచి డీ 94 వరకు అన్ని కాలువలకు చివరి ఆయకట్టు వరకు నీటిని అందించాలని లేని పక్షంలో రైతులందరికతో కలిసి స్వయంగా తనే వచ్చి కాకతీయ కెనాల్ గేట్లను ఎత్తుకోవలసివస్తుందని, ఆ సమస్య రాకుండా చూడాలని తెలిపారు.

ఏసీపీ, ఆర్డీవోలకు మెమోలు

కరీంనగర్, జనవరి 26(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కరీంనగర్‌లో కేంద్ర, రాష్ట్ర మంత్రుల పర్యటన సందర్భంగా జరిగిన తోపులాట విషయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఆ సంఘటన నేపథ్యంలో కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)వెంకటస్వామితో పాటు, రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్‌కు ఆదివారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మెమోలు జారీ చేశారు. ఈ నెల 24వ తేదీన కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో పలుమార్లు పోలీసులు తమను తోసివేశారని రాష్ట్రమంత్రులు అసహనానికి గురయ్యారు. ఈ సందర్భంగా లా అండ్ ఆర్డర్, బందోబస్తు ఏర్పాట్లు, హెలిప్యాడ్ వద్ద ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని మెమోలో పేర్కొన్నారు. మంత్రుల పర్యటనకు ముందు రోజు సన్నాహక సమావేశానికి లా అండ్ ఆర్డర్ అండ్ సెక్యూరిటీ ఇన్‌చార్జిగా ఉన్న కరీంనగర్‌టౌన్ అసిస్టెంట్ కమిషర్ ఆఫ్ పోలీస్ వెంకటస్వామి సమావేశానికి హాజరుకాలేదని మెమోలో పేర్కొన్నారు. మూడు రోజుల్లోపు వివరణ ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్‌కు హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లు, కాన్వాయ్ సన్నద్ధం, ప్రముఖుల వేదికల వద్ద ఆహార ఏర్పాట్లు, భద్రత ఆడిట్, ప్రొటోకాల్ సమన్వయం పర్యవేక్షించడంలో రాష్ట్ర మంత్రులు అసంతృప్తి వ్యక్తంచేశారని దీనికి సంబంధించిన వివరాణాత్మకమైన నివేదికను మూడు రోజుల్లో అందించాలని మెమోలు జారీ చేశారు.

బీజేపీ క్రియాశీల సభ్యత్వం తీసుకున్న కరీంనగర్ మేయర్

భగత్‌నగర్, జనవరి (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మేయర్ సునీల్‌రావు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆదివారం బీజేపీ క్రియాశీల సభ్యత్వం స్వీకరిం చారు. కరీంనగర్‌లో శనివారం కేంద్ర మంత్రి సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరిన సునీల్‌రావు, తన అనుచరులతో కలిసి బీజేపీ సభ్యత్వాలు స్వీకరించారు.

హనుమాన్ ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

హుజూరాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హనుమాన్ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌కు ఆదివారం పాలకవర్గ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఆలయ గర్భగుడి చుట్టూ ఉన్న మండపం చిన్నదిగా ఉన్నందున భక్తులకు అసౌకర్యంగా ఉందన్నారు. ఆలయంలో విశాలమైన మండపం, యజ్ఞశాల నిర్మించాలని, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఆలయంలో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొలిపాక శంకర్, బల్లు పున్నంచందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ అనిల్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా రవాణ శాఖ అధికారి రంగారావు

సుల్తానాబాద్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలకు తావు లేకుండా వాహనాలను నడపాలని జిల్లా రవాణా శాఖ అధికారి రంగారావు అన్నారు. ఆది వారం రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లో లారీ, వ్యాన్ యజమా నులకు, డ్రైవర్లకు అవగాహనా సదస్సు నిర్వహించారు. జిల్లా రవాణా శాఖ అధికారి మాట్లాడుతూ. వాహనా లకు సంబంధించిన అన్ని పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరిం చారు. పెద్దపెల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ వాహన యజమానులకు, డ్రైవర్ల కు పలు సూచనలు చేశారు. ఎంవీఐ మసూద్, ఏఎంవీఐ మధు తో పాటుగా సుమారు 200 మంది లారీ, వ్యాన్ ల యజమానులు, డ్రైవర్‌లు పాల్గొన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు సరికావు

- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : లోపా యికారి ఒప్పందాలతో కిషన్‌రెడ్డితో బండి సంజయ్ కూడా జతకట్టాడని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంపై ఇందిరమ్మ బొమ్మ ఉంటే, రేషన్ కార్డులపైన ప్రధాన మంత్రి మోదీ బొమ్మ వేయకుంటే కేంద్రం నుంచి డబ్బులు ఇవ్వమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. భారత దేశంలో తెలంగాణ రాష్ట్రం కూడా ఒక అంతర్భాగం అన్నది గుర్తెరగాలన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్రానికి టాక్స్‌లు కడుతున్నాం.. భారత రాజ్యాంగం అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను ఇక్కడ గౌరవిస్తున్నామన్నారు. గత ప్రభు త్వంలో ఎంపీగా ఉన్న బండి సంజయ్ ఎపుడు కూడా రేషన్ కార్డుల గురించి మాట్లాడలేదని, డబ్బులు బెడ్‌రూం ఇండ్లు ఇస్తానన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఎం దుకు ఇవ్వలేదో అడగలేదన్నారు. ఇంటికో ఉద్యోగం అంది ఇవ్వలేదని, ఈరోజు తాము ఇంటికో ఉద్యోగం ఇస్తుంటే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఓర్వలేక పోతు న్నారని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ ఎస్, బీజేపీ ఒకటయ్యారని అందరు భావించార న్నారు. అందుకే స్థానికేతరులను ఇక్కడికి తీసుకొచ్చి బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్ నిలబెట్టి కేటీఆర్‌తో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. బండి సంజయ్ మాట్లాడుతున్న విధానం చూస్తే అది నిజమని అనుమానాలు వస్తున్నా యన్నారు. లోపా యికారి ఒప్పందాల్లో కిషన్‌రెడ్డితో బండి సంజయ్ కూడా జతకట్టాడని ఆరోపించారు. బండి సంజయ్ మాట్లాడిన విధానం భారత రాజ్యాంగ స్ఫూర్తికి విఘా తం కలిగించే విధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూప తిరుపతిరెడ్డి, డైరెక్టర్ ఎండీ ఖాజా, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, తం గళ్ళపల్లి మండల అధ్యక్షుడు జలగం ప్రవీన్, మహిళ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య పాల్గొన్నారు.

దేశభక్తి చాటుకున్న కొడుముంజ మత్స్యకారులు



జెండాను ఎగురవేస్తున్న గ్రామస్థులు, మత్స్యకారులు

వేములవాడ టౌన్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరులో ముంపునకు గురైన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలంలోని కొడుముంజ గ్రామపంచాయతీ కార్యాలయంపై మత్స్యకారులు ఆదివారం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా కొడుముంజ ముదిరాజ్ సంఘం సభ్యులు, స్థానిక మత్స్యకారులు నీటిపై వెళ్లి ముంపునకు గురైన గ్రామపంచాయతీపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం గ్రామస్థాయి తెప్పల పోటీలో విజయం సాధించిన విజేతలు శ్రీనివాస్, రేగుల మధులను భూమల లక్ష్మణ్, రాగుల ప్రశాంత్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రేగుల పర్శరాములు, గ్రామస్థులు సన్మానించారు.

అమ్మకు ఆత్మ గౌరవం

ధర్మారం జనవరి 26 (ఆంధ్రజ్యోతి) వివిధ పనుల కోసం కార్యాలయానికి వస్తున్న చంటి పిల్లల తల్లుల ఇబ్బందులు చూసిన తహసీల్దార్ ఓ కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టాడు. వారి కోసం పాలిచ్చే గదిని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో పాలు ఇచ్చేందుకు ప్రత్యేక గదిని ఎమ్మార్వో ఆరీపోద్దీన్ ఏర్పాటు చేశారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ గదికి తుది రూపును ఇవ్వడంతో రెవెన్యూ అధికారులను పలువురు ప్రశంసిస్తున్నారు.



తల్లి పాలిచ్చు గది వద్ద అధికారులు

రెపరెపలాడిన మువ్వన్నెల జెండాలు


పెద్దపల్లిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే


జెండావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


పెద్దపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విజయరమణరావు


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో సురేష్

పెద్దపల్లి కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పెద్దపెల్లి ట్రినిటి విద్యాసంస్థల్లో విద్యాసంస్థల ఫౌండర్ ఆఫ్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి జెండా ఎగురవేసి అంబేద్కర్ సేవలను స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను కొనియాడారు. గాయత్రి విద్యాసంస్థల ఆధ్వర్యంలో చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. విద్యాసంస్థల్లో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. మార్కెట్ కమిటీ, మున్సిపల్ కార్యాలయంలోనూ వేడుకలు జరిగాయి. బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి జెండా ఎగురవేశారు.

ధర్మారం: మండల వ్యాప్తంగా గణతంత్ర వేడుకలను నిర్వహించారు. ఎమ్మార్వో ఆరీఫొద్దీన్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో ప్రభాకర్ జెండా ఎగురవేశారు. మేడారం పీఏసీఎస్‌లో చైర్మెన్ బలరాంరెడ్డి జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ తరుపున సీనియర్ కాడె సూర్యనారాయణ బీఆర్ఎస్ పార్టీ పూస్కూరి జితేందర్ రావు జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ధర్మారం, మేడారం గ్రామాల ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది.

కోల్‌సిటీటౌన్: అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి విద్యాసంస్థలో జరిగిన కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ మంజులా శ్రీనివాస్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యూనివర్సిటీ పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమాకాంత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. శాతవాహన యూనివర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ వై ప్రసాద్, అజయ్‌కుమార్, యాదవయ్య, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. ఉషోదయ హైస్కూల్, వాసవ్య హైస్కూల్, గుడ్‌మార్నింగ్ హైస్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల తదితర విద్యాసంస్థల్లో గణతంత్ర దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ఎంపీడీవో రామ్మోహన్‌చారి, డిప్యూటీ తహసీల్దార్ గుర్రెపల్లి శంకర్, వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో చైర్మన్ తిరుపతిరెడ్డి, ఎంఈఓ మహేష్, ఎస్సై వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, వ్యవసాయ కార్యాలయంలో ఏవో నాగార్జున, ఏపీఎం కనకయ్య, పశువైద్యులు సురేష్, బ్యాంకు మేనేజర్ కరుణశ్రీ, ఎంపీఓ కిరణ్‌యాదవ్ ఆయా కార్యాలయాల్లో జెండాలను ఎగురవేశారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, మాజీ జడ్పీటీసీ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సదయ్య, నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గణతంత్ర వేడుకలను నిర్వహించారు. తహసీల్దార్ బషీరొద్దీన్, భాస్కర్‌రావు, ఏపీఎం సుధాకర్, ఉమాపతి, డాక్టర్లు నిస్క్రిష్టాన, జాన్సీ, సంపత్‌రెడ్డి, వివిధ పాఠశాలలో గంద్ర దేవేందర్‌రావు, నరేంద్రచారి, సదయ్య జెండాలు ఎగురవేశారు.

ఓదెల: మండలంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీవో తిరుపతి, ఎస్సై రమేష్, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. జీలకుంటకు చెందిన రాగిడి మంగ శ్రీనివాస్‌రెడ్డి తనయుడు ప్రజ్ఞ స్మారకార్థం క్రీడా విజేతలకు బహుమతులను అందజేశారు. హరిపురం పాఠశాలలో మాజీ డైరెక్టర్ అమ్ముల బిక్షపతి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పాలకుర్తి: ఎంపీడీవో అల్లం పూర్ణచందర్ రావు, తహసీల్దార్ ముద్దమల్ల జ్యోతి, కేశోరాం కర్మగారంలో కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి మాదాసు శ్రీనివాస్, పర్మినెంటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి, ఎస్ఐ స్వామి కార్యాలయాల్లో జెండా ఎగురవేశారు. యూనివర్సల్ పాఠశాలలో కరస్పాండెంట్ ఇస్మాయిల్, జేమ్స్ మాడల్ స్కూల్‌లో కరస్పాండెంట్ మహేష్, గ్లోబల్ పాఠశాలలో కరస్పాండెంట్ బుర్ర సత్యం గౌడ్‌లు క్రీడా విజేతలకు బహుమతులు అందించారు. ఈసాలతక్కళ్ళపల్లి ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం ఈర్ల శోభారాణి, చైర్‌పర్సన్ దాడి అనితలు బహుమతులను అందజేశారు.

సుల్తానాబాద్: గాంధీనగర్‌లో పారిశుధ్య కార్మికులచే జాతీయ పతాకాన్ని ఎగురవేయించి సన్మానించారు. జడ్జి దుర్గం గణేష్, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శనరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత కృష్ణ, కమిషనర్ వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ వినుపాల ప్రకాష్ రావు, ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ రమాదేవి, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్‌కుమార్, సింగిల్ విండోలో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ సీఈఓ సంతోష్ జెండా ఆవిష్కరించారు.

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా మువ్వన్నెల జండా రెపరెపలాడింది. తహసీలార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో అలివేణి, సీడీపీవో కవిత, కార్యదర్శులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి.

ముత్తారం: కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గణతంత్ర వేడుకలను నిర్వహించారు. పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. తహసీల్దార్ సుమాన్, ఎంపీడీవో సురేష్, వైద్యాధికారి అమరేందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజిలతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంథని: ఆర్డీవో సురేష్, తహసీల్దార్ రాజయ్య, కమిషనర్ మనోహర్, ఎంపీడీవో శశికళ, సీఈవో అశోక్‌కుమార్, మేనేజర్ శ్రవణ్‌కుమార్ ఆయా కార్యాలయాల్లో జెండాలు ఎగురవేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎగోలపు శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఐయిలి ప్రసాద్‌లు జెండాలను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ రాజుగౌడ్, ఆయా పార్టీల నాయకులు వొడ్నాల శ్రీనివాస్, గొబ్బూరి వంశీలు పాల్గొన్నారు.

మంథనిరూరల్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో గణతంత్ర వేడుకలను నిర్వహించారు. పంచాయతీ కార్యాలయాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఆవరణల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. కమాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

కమాన్‌పూర్: ఎమ్మార్వో వాసంతి, ఎంపీడీవో లలిత, ఉన్నత పాఠశాలలో ఎంఈవో విజయ్‌కుమార్, ఎస్సై ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ భాస్కర్‌రావు, ఏవో రామకృష్ణ ఆయా కార్యాలయాల్లో జెండాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతిలో మండలంలో ప్రథమ సాహితికి రూ.12,000, ద్వితీయ వైష్ణవికి రూ.7వేల రూపాయల ప్రోత్సాహకాన్ని మండల కేంద్రానికి చెందిన డాక్టర్ విజయ్‌కుమార్ అందజేశారు.

రామగిరి: తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎంపీడీవో శైలజారాణి, ఎస్ఐ చంద్రకుమార్, ఓసిపి-2 ప్రాజెక్టు కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి వెంకటరమణలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఆర్జీ-3 పరిధిలోని ఐఎన్‌టియుసి, ఏఐటియుసి, సీఐటియు, ఐఎఫ్‌టియు, బిఎంఎస్, హెచ్‌ఎంఎస్, ట్రేడ్‌యూనియన్ నాయకులు వారి కార్యాలయాలపై జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

పెద్దపల్లి కల్చరల్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విజయరమణారావు జెండా ఎగురవేశారు. పట్టణంలోని పలు కూడళ్ళలో జాతీయ పతకాన్ని ఆవిష్కరించి పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు. మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, మినుపాల ప్రకాష్ రావు, నాయకులు మల్లయ్య, సంపత్, సుభాష్, పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్: పేదల ప్రజల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యమని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. శివాజీనగర్‌లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ నిర్వహించిన గణతంత్ర వేడుకలకు ఎమ్మెల్యే జెండావిష్కరించారు. మేయర్ బంగి అనీల్ కుమార్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, కొలిపాక సుజాత, పాల్గొన్నారు.

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది మెరుగైన సేవలందించాలని కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మేయర్ అనీల్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలు నెరవేర్చేవిధంగా దేశాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, ఈఈ రామన్, ఏసీపీ శ్రీధర్‌ప్రసాద్, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ అంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సునీల్ రాథోడ్, కుమారస్వామి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో సీజీఎం ఉదయ్ రాజ్ హన్స జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యంగా యాజమాన్యం పని చేస్తుందన్నారు. యూరియా కొరత లేకుండా వ్యవసాయాభివృద్ధి జరుగుతుందన్నారు. గోదావరిఖని అదనపు జిల్లా న్యాయస్థానంలో న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాసరావు, మున్సిఫ్ కోర్టు కాంప్లెక్స్‌లో 1వ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రే రామగిరి స్వారిక జాతీయ జెండాను ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు తొటం సతీష్, జవ్వాజి శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: సీఐ ప్రసాదరావు జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. సింగరేణి, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయపతాకాలను ఆవిష్కరించారు. తెలంగాణ చౌరస్తాలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్ జండా ఎగురవేశారు. 17వ డివిజన్ సంతోష్‌నగర్‌లో బీజేపీ నాయకులు మూకిరి రాజు, ఆకుల శశి, మారెపల్లి శ్రీనివాస్ జెండా ఎగురవేశారు. పోతనకాలనీలో ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాసు, దుర్గాప్రసాద్, అడ్కాపురం చంద్రమౌళి పాల్గొన్నారు. ఐఎన్‌టీయూసీ ఆఫీస్‌లో ఏరియా వైస్ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్, టీబీజీకేఎస్ ఆఫీస్ ఆవరణలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్‌లు జాతీయ జండాలను ఎగురవేశారు.

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. గోదావరిఖని చౌరస్తాలో బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీనగర్ దోబీ ఘాట్ వద్ద కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ జెండావిష్కరించారు. దుర్గానగర్‌లో కొలనేని శ్రీనివాస్ జెండావిష్కరించారు. సీనియర్ సిటీజన్లు గీట్ల దామోదర్‌రెడ్డి, మంథని రాజయ్య, పంజాల రాజకొమురయ్య, బాలసాని రాజయ్యను సన్మానించారు. శివాజీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర మహిళా మోర్చ సభ్యురాలు సోమారపు లావణ్య జెండావిష్కరిచారు. భాస్కర్‌రావు భవన్‌లో సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు జెండావిష్కరించారు. శివాజీనగర్‌లోని హమాలీ సంఘం కార్యాలయంలో పాతిపెల్లి లక్ష్మి, ఎల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై జెండావిష్కరణ చేశారు. చౌరస్తాలో గౌస్ ఏ పాక్ చిల్లా వద్ద ముస్లీం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హాజీ అలీ జెండావిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆమంచ గౌతం జెండావిష్కరించారు.

జూలపల్లి: జూలపల్లి మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ జక్కని స్వర్ణ, ఎంపీడీవో పద్మజ, ఎస్ఐ సనత్‌కుమార్ జెండాను ఆవిష్కరించారు. పశువైద్యులు ఆజారొద్దిన్, వైద్యులు సంపత్‌రెడ్డి, పలువురు పాల్గొన్నారు.

రామగుండం కమిషనరేట్‌లో

కోల్‌సిటీ: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీపీ శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజలు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల మధ్య జీవిస్తున్నారన్నారు.

2020లో పోలీస్ విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏసీపీ చిలుకూరి వెంకటేశ్వర్లు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్ మంథని రాజేందర్, హోంగార్డు రాధాకృష్ణ, గిరీష్ కుమార్, సప్తపతి కిష్టయ్య, అతి ఉత్కృష్ట సేవా పతకాలు పొందిన హోంగార్డులు కనుకుంట్ల శివరాం, ఇటుకల సమ్మయ్య, జూల ఓదెలు, కోత రాజేశం, మహ్మద్ సాదిక్ అలీ, 2024లో అతి ఉత్కృష్ట సేవా పతకం పొందిన ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, బీ రవీందర్‌రావు, పీ శ్రీనివాస్‌గౌడ్‌లకు సీపీ పతకాలు అందించారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, గోదావరిఖని ఏసీపీ రమేష్, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏసీపీ వెంకటేశ్వర్లు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సుందర్‌రావు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


పెద్దపల్లి కలెక్టరేట్‌లో, గాయత్రి విద్యా సంస్థలో, ఖని కృష్ణవేణి స్కూల్‌లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఉత్తమ సేవలకు 'ప్రశంస'


గణతంత్ర వేడుకల సందర్భంగా పలువురు ఉత్తమ ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేశారు. కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న డీసీవో శ్రీమాల


డీసీహెచ్ డాక్టర్ శ్రీధర్ | ఏసీపీ గజ్జి కృష్ణ | సూపరింటెండెంట్ ప్రకాశ్ | సీఐ ప్రశాంత్ కుమార్ | ఎస్ఐ మల్లేష్ | డీఎస్‌డీవో సురేష్ | సీనియర్ అసిస్టెంట్ కె శైలజ | సీనియర్ అసిస్టెంట్ ఖాజామియా | నాయబ్ తహసీల్దార్ ఎస్ విజయ్ | లెక్చరర్ అశోక్‌రెడ్డి


ప్రశంసా పత్రం అందుకుంటున్న సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు మేరుగు భీష్మాచారి, ఆకుల మహేందర్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

5వ పేజీ తరువాయి

చికిత్స అందిస్తున్నామన్నారు. ఎంసీహెచ్ పెద్దపల్లిలో నార్మల్ స్కానింగ్‌తో పాటు టిఫ్ఫా స్కానింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు.

● రూ. 15.54 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు..

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా జిల్లాలోని 477 పాఠశాలల్లో 15 కోట్ల 54 లక్షల రూపాయలను ఖర్చు చేసి మౌలిక వసతులు కల్పించామని అన్నారు. జిల్లాలో డీఎస్సీ 2024ను విజయవంతంగా నిర్వహించుకొని 78 మందికి నియామక పత్రాలు అందించామన్నారు. పెద్దపల్లిలో బస్సు డిపో ఏర్పాటుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవో ప్రాంగణంలోని భూమిని ఆర్టీసీకి అప్పగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 610 కోట్లతో రోడ్లు భవనాల శాఖ ద్వారా పనులు చేపట్టామన్నారు. అమృత్ 2.0 కింద రామగుండం కార్పొరేషన్ పరిధిలో దాదాపు 312 కోట్లు ఖర్చు చేస్తూ సీవరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులను, టీయూఎఫ్ఐడీసీ నిధుల కింద రూ.144 కోట్లు ఖర్చు చేస్తు అవసరమైన సీసీ రోడ్లు, మురికి కాలువలు, సెంట్రల్ లైటింగ్, మున్సిపల్ భవన నిర్మాణ అభివృద్ధి పనులను చేపట్టామని అన్నారు. టీ-ఐడియా, టీ-ప్రైడ్ పెద్దపల్లిలో స్థాపించిన 33 సేవా, తయారీ రంగ పరిశ్రమలకు 36 కోట్ల 15 లక్షల సబ్సిడీ మంజూరు చేశామని కలెక్టర్ అన్నారు.

● రూ. 116 కోట్ల 74 లక్షల రుణాల పంపిణీ

జిల్లాలోని స్వశక్తి సంఘాలకు 116 కోట్ల 74 లక్షల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను కలెక్టర్ పంపిణీ చేశారు. చైతన్యజ్యోతి జిల్లా మహిళా సమాఖ్య ద్వారా స్వశక్తి మహిళా సంఘాలకు 102 కోట్ల 11 లక్షల 50 వేల రూపాయలు, మెప్మా ద్వారా మరో 113 సంఘాలకు 14 కోట్ల 62 లక్షల 50 వేల బ్యాంకు లింకేజీ రుణాలను పంపిణీ చేశామన్నారు. పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, జిల్లా జడ్జి డాక్టర్ హేమంత్ కుమార్, జూనియర్ సివిల్ జడ్జి ఎన్ మంజుల, డీసీపీ ఎం చేతన, అదనపు కలెక్టర్‌లు జే అరుణశ్రీ, డి వేణు, పెద్దపల్లి ఆర్‌డీఓ బి గంగయ్య, ఏసీపీ గజ్జి కృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

పెద్దపల్లి కల్చరల్: కలెక్టరేట్ ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చిన్నారులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయన్నారు. పెద్దపల్లి జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, గట్టెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెద్దకాల్వల నోబల్ స్కూల్ విద్యార్థినులు, పెద్దపల్లి మహాత్మాజ్యోతిబా ఫూలె గురుకుల విద్యార్థినులు, గీతాంజలి, గాయత్రి స్కూల్ విద్యార్థినులు ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. డీఈవో మాధవి, డీఎంహెచ్‌వో డాక్టర్ అన్న ప్రసన్న కుమారీ, సూపరింటెండెంట్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఒక్క కుటుంబానికీ అన్యాయం జరగదు

ధర్మారం జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ ఒక్క కుటుంబానికి అన్యాయం జరగదని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్ కుమార్ అన్నారు. బంజేరుపల్లి గ్రామంలో నాలుగు పథకాలను ప్రారంభించారు. గ్రామంలో 143 మంది ఇందిరమ్మ ఇండ్లకు, 48 కుటుంబాలకు రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా కింద 12 మందిని ఎంపిక చేయగా పత్రాలను అందజేశారు. రైతు భరోసా కింద గ్రామంలో 320 మంది అన్నదాతలు ఎంపికైయ్యారని వారికి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. డీపీవో వీరబుచ్చయ్య, తహసీల్దార్ ఆరీపొద్దీన్, ఎంపిడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో రమేష్, ఆర్ఐ వరలక్ష్మి, ఏఎంసీ చైర్మెన్ రూప్లానాయక్‌పాల్గొన్నారు.

జూలపల్లి: నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కోనరావుపేటలో 4 పథకాల లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ గండు సంజీవ్, తహసీల్దార్ జక్కని స్వర్ణ, ఎంపిడిఓ పద్మజ, ఎంపిఓ అనిల్‌రెడ్డి, ఏపివో సదానందం పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

మంథని, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని ఆదివారంఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంకరి కుమార్, ప్రధాన కార్యదర్శిగా పోతరాజు సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా బర్ల సంపత్, సహాయ కార్యదర్శిగా గంధం అంజనేయులు, కోశాధికారిగా తగరం రాజులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా మారుతి, అంకరి ప్రకాష్‌లు వ్యవహరించారు.

లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రొసీడింగ్స్ అందజేత

పెద్దపల్లి రూరల్ , జనవరి 26(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అదనపు కలెక్టర్ వేణు అన్నారు. నిమ్మనపల్లిలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలో నాలుగు పథకాలకు సంబంధించిన అర్హులైన వారికి పత్రాలను పంపిణీ చేశారు. ఆర్డీవో బొద్దుల గంగయ్య, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో అలివేణి, కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: అంకంపల్లిలో అర్హులకు నాలుగు పథకాల ప్రొసీడింగ్స్‌ను మండల ప్రత్యేక అధికారి శ్రీమాల అందజేశారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, ఎంపీడీఓ రామ్మోహనచారి, తహసీల్దార్ వకీల్, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేణ సదయ్య పాల్గొన్నారు.

ఓదెల: సంక్షేమ పథకాలు రాని వారు ఆందోళన చెందవద్దని, మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ నిరంతరంగా కొనసాగుతుందని జెడ్పి సీఈవో నరేందర్ అన్నారు. శానగొండలో జడ్పీ సీఈవో, స్పెషల్ అధికారులు నాలుగు పథకాలను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీవో తిరుపతి, ఎస్సై రమేష్, సింగల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో, ఏఈవో పాల్గొన్నారు.

ముత్తారం: మచ్చుపేటలో నాలుగు పథకాల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మండల ప్రత్యేక అధికారి కలిందిని, ఎంపీడీవో సురేష్, తహసీల్దార్ సుమన్, ఎంపీఓ గోవర్ధన్, గారు,మండల వ్యవసాయ అధికారి అనూష, ఎస్ఐ నరేష్, పాల్గొన్నారు.

రామగిరి: రత్నాపూర్ రైతువేదికలో నాలుగు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు ఆర్డీవో అందజేశారు. ఎంపీడీవో శైలజారాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రొసిడింగ్‌లను అందజేశారు. తహసీల్దార్ రాంచందర్ రావు, ఎంపీవో ఉమేష్, వ్యవసాయ అధికారి శ్రీకాంత్, ఏపివో ఈసీ లక్ష్మన్, ఏఈవోలు, పంచాయితి సెక్రటరీలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంథనిరూరల్: అడవిసోమన్‌పల్లి గ్రామ పంచాయతీలో 4 పథకాలను మండల ప్రత్యేక అధికారి ఆదిరెడ్డి లబ్ధిదారులకు ప్రొసిడింగ్స్ అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, టీజీఈఆర్‌సీ అడ్వైయిరీ మెంబర్ శశిభూషన్‌కాచే, ఎంపీడీవో శశికళ, తహశీల్దార్ రాజయ్య, డీఎల్‌పీవో సతీష్, ఏపీవో సదానందం, వివిధ శాఖల అధికారులు పాల్గన్నారు.

రొంపికుంటలో రసాభాస

కమాన్‌పూర్: రొంపికుంటలో ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు 269మంది ఉన్నారని ఎంపీడీవో వెల్లడించారు. మిగితావారి జాబితా కూడా ఇదేసభలో చదవాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, ప్రజలు డిమాండ్ చేశారు. మిగిలిన లబ్ధిదారులకు ఎప్పుడు మంజూరు పత్రాలు ఇస్తారని, అర్హుల సంఖ్య వెల్లడించాలని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు ఇరుపక్షాల నాయకులను అక్కడినుండి పంపించారు. మండల ప్రత్యేక అధికారి ప్రవీణ్‌రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. అన్ని గ్రామాల్లో నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పైలెట్ ప్రాజెక్టుగా ఒక్క గ్రామానికే పథకాలను పరిమితం చేయడం ప్రజలను మోసం చేయడమేనని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తాటికొండ శంకర్, మేకల సంపత్ యాదవ్, ఉప్పరి శ్రీనివాస్‌యాదవ్, చిందం తిరుపతి, నీలం శ్రీనివాస్, రాచకొండ రవి, కొయ్యడ కుమార్, మచ్చరిగి రాము, మట్ట శంకర్, కొయ్యడ మల్లారపు అరుణ్‌కుమార్, విశ్వతేజలు ఆరోపించారు. అన్ని గ్రామాల్లో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించేలా ప్రభుత్వం ప్రణాళిక ప్రకారంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.


రొంపికుంట ప్రజాపాలన గ్రామసభలో నాయకుల మధ్య వాగ్వాదం

దేశ ఆర్థిక ప్రగతిలో సింగరేణి ముఖ్య పాత్ర


బెలూన్స్ ఎగురవేస్తున్న జీఎం, అధికారులు, కార్పొరేట్‌లో సత్కారం అందుకుంటున్న ఓసిపి-1 హెడ్ ఓవర్‌మెన్ తిరుపతిరావు

గోదావరిఖని, జనవరి 26(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక ప్రగతిలో సింగరేణి ముఖ్యపాత్ర పోషిస్తోందని ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం, జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. సెక్యూరిటీ గార్డులతో గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌జీ-1లో కార్మిక సంక్షేమానికి సంస్థ ఎనలేని కృషి చేస్తుందన్నారు. గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చడంతో పాటు క్యాత్ ల్యాబ్ ఏర్పాటు జరుగుతుందన్నారు. ఆర్‌జీ-1 ఏరియాలో 533క్వార్టర్ల నిర్మాణానికి అనుమతులు వచ్చాయని, పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్టు చెప్పారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఎస్ఓటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం (పర్సనల్) కిరణ్ బాబు, ఇంజనీర్ దాసరి వెంక టేశ్వర్‌రావు, ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లయ్య, స్వామి, అధికారుల సంఘం అధ్యక్షుడు మల్లేష్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో జీఎం బండి వెంకటయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అబ్దుల్‌కలాం స్టేడియంలో జరిగిన వేడుకల్లో జీఎం జాతీయ జండా ఎగురవేసి, ఎస్అండ్‌పీసీ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. డివిజన్ పరిధిలో ఉత్తమ కార్మికులను



సన్మానించారు. ఉత్పత్తి, నాణ్యత, రవాణాలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని జీఎం కోరారు. సేవా అధ్యక్షురాలు వనజా వెంకటయ్య, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ రవీందర్, సీఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు మధుసూదన్, ఎస్వోటూ జీఎం రాముడు, అధికారులు పాల్గొన్నారు.

రామగిరి: ప్రతీ ఒక్కరు హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో నిర్వహించిన వేడుకల్లో జీఎం కార్యాలయంలో వెంకటేశ్వర్లు, రాణిరుద్రమాదేవి క్రీడా ప్రాంగణంలో సుధాకర్‌రావులు జెండాలను ఆవిష్కరించారు. ఎస్అండ్‌పిసి, విద్యార్థులు పరేడ్‌తోపాటు గౌరవ వందనాన్ని స్వీకరించారు. విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతులు, ఉత్తమ కార్మికులకు సత్కారం, ప్రశంస పత్రాలను అంజేశారు. అధికారుల సంఘం అధ్యక్షుడు సిహెచ్ వెంకటరమణ, సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకర్‌రావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.